

అలల వంతెన.. మూన్నాళ్ల ముచ్చట!

- ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్వహణపై అధికారులు వెనకడుగు
- అలల తాకిడితో ఆర్‌కే బీచ్ నుంచి ఎత్తివేయాలని నిర్ణయం
- ఫ్లోటింగ్ బ్రిడ్జిని ముక్కలుగా విడదీసి ఒడ్డున పడేసిన వైనం



... వివరాలు మెయిన్‌లో

అటవీ దొంగల మెడకు ఉచ్చు!

చింతాలమ్మఘాట్ రిజర్వు ఫారెస్టులో అనుమతులకు మించి చెట్లు నరికి వేయించిన సిబ్బంది

- కొమ్మలను వేలం వేయకుండా ఇటుక బట్టీలకు అమ్మకం
- కృష్ణాదేవిపేట, పరిసరాల్లో స్క్వాడ్ డీఎఫ్‌వో, చింతపల్లి డీఎఫ్‌వో తనిఖీలు
- 50 క్యూబిక్ మీటర్ల కొమ్మలు విక్రయించినట్టు గుర్తింపు
- చెట్లు నరికివేత కూలి పనులకు డ్రాచేసిన సొమ్ముకూ లెక్కల్లేవ్!
- రెండు, మూడు రోజుల్లో సీసీఎఫ్‌కు నివేదిక
- పెదవలస రేంజ్ సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధం



గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఇటుక బట్టీ వద్ద మారుజాతి కలపను కొలతలు వేస్తున్న స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం (ఫైల్ ఫొటో)



చింతాలమ్మఘాట్ రోడ్డులో అలైన్‌మెంట్ దాటి రిజర్వు ఫారెస్టులో నరికిన భారీ వృక్షం (ఫైల్ ఫొటో)



రిజర్వు ఫారెస్టులో నరివేసిన చెట్టు మొదలు కొలతలు తీస్తున్న అటవీ శాఖ సిబ్బంది (ఫైల్)

విశాఖపట్నం/ కొయ్యూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి అటవీ డివిజన్ పరిధిలో జాతీయరహదారి నిర్మాణానికి అనుగుణంగా చేపట్టని చెట్ల తొలగింపులో అటవీశాఖ సిబ్బంది అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రోడ్డు నిర్మాణ ప్రాంతానికి సంబంధం లేని రిజర్వుఫారెస్టులో చెట్లు కొట్టేసిన పెదవలస ఫారెస్టు రేంజ్ సిబ్బంది దుంగలను డిపోకు తరలించి, కొమ్మలను అనధికారికంగా విక్రయించారని బయటపడింది. దీంతోపాటు చెట్ల తొలగింపునకు నిధులు డ్రాచేసి నాలుగు నెలలైనా ఇప్పటికీ లెక్కలు చెప్పకపోవడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

రాజమహేంద్రవరం నుంచి పాడేరు, అరకులోయ, అనంతగిరి మీదుగా విజయనగరం వరకు జాతీయ రహదారి 516-ఈ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కొయ్యూరు మండలం కాకరపాడు జంక్షన్-గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట మధ్య రావణాపల్లి దాటాక చింతాలమ్మఘాట్ రోడ్డు (ఏడొంపుల ఘాట్) వుంది. జాతీయ రహదారి నిర్మాణం కోసం ఇక్కడ చెట్ల తొలగింపునకు అటవీ శాఖ ఉన్నతాధికారులు అనుమతించడంతో పాటు నిధులు మంజూరు చేశారు. పనులు చేపట్టిన సిబ్బంది చెట్లు నరికి, డిపోలకు తరలించారు. అయితే ఈ పనులకు సంబంధించి ఎక్కువ మొత్తంలో నిధులు డ్రా చేశారు. మిగిలిన సొమ్ము వెనక్కు ఇవ్వకుండా ఖర్చు చూపించేందుకు రోడ్డు నిర్మాణంతో సంబంధం లేని రిజర్వు ఫారెస్టులో 89 చెట్లను పెదవలస ఫారెస్టు రేంజ్ సిబ్బంది నరికించారు. వాటి దుంగలు కాకరపాడు అటవీ డిపోకు తరలించారు. అయితే చెట్ల కొమ్మలు వేలం వేయకుండా ఇటుక బట్టీల నిర్వాహకులకు, అడితీల వ్యాపారులకు విక్రయించేశారు.

అక్రమాలపై విచారణ

చెట్ల తొలగింపులో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదు మేరకు అటవీ శాఖ స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా కృష్ణాదేవిపేట, పరిసరాల్లో ఇటుక బట్టీలపై ఇటీవల దాడులు చేశారు. అక్రమంగా కొనుగోలుచేసిన 35 క్యూబిక్ మీటర్ల వంట చెరకు (చెట్ల కొమ్మలు) గుర్తించి, బట్టీల యజమానులకు రూ.1.1 లక్షల జరిమానా విధించారు. నిబంధనల మేరకు చెట్లు నరికి వేసిన తరువాత వాణిజ్యపరంగా విక్రయానికి అనువైన దుంగలను అటవీ శాఖ డిపోకు పంపాలి. మీటరు పొడవున్న కొమ్మలను అక్కడికక్కడే వేలం వేయాలి. కానీ పెదవలస రేంజ్ పరిధిలో కొట్టేసిన చెట్ల కొమ్మలు వేలం వేసినట్టు రికార్డులు లేవని విచారణలో తేలింది. రోడ్డు నిర్మాణంతో సంబంధంలేని రిజర్వు ఫారెస్టులో కొట్టేసిన 89 చెట్ల కొమ్మల్లో సుమారు 50 క్యూబిక్ మీటర్ల కొమ్మలు అనధికారికంగా విక్రయించేశారు. గత ఏడాది తొలగించిన చెట్ల కొమ్మలు కూడా ఇలానే విక్రయించారన్న అనుమానాలున్నాయి. ఈ దిశగా విచారణ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.

కాగా పెదవలస ఫారెస్టు రేంజ్ పరిధిలో చెట్ల తొలగింపునకు రూ.68 లక్షలు డ్రాచేసి నాలుగు నెలలు దాటినా ఇంతవరకు ఖర్చుల లెక్కలు చెప్పలేదు. నిబంధనల మేరకు ప్రతి నెలాఖరున ఉన్నతాధికారులకు లెక్కలు సమర్పించాలి. చెట్లు నరికివేసి డిపోకు తరలించేటప్పుడు చెట్టు కైవారం (చుట్టు కొలత) ఎన్ని క్యూబిక్ మీటర్లు? ఏ జాతికి చెందినది? అనేది ఇన్వాయిస్‌లో ప్రస్తావించాలి. డిపోకు వచ్చిన తరువాత అక్కడి సిబ్బంది కొలతలు వేసి చెట్లు ఏ జాతికి చెందినవో నిర్ధారిస్తారు. ఆ తరువాతే నరికివేతకు బిల్లులు చెల్లించాలి. కానీ పెదవలస రేంజ్ సిబ్బంది ఇవేవీ పట్టించుకోలేదన్న ఆరోపణలపై స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం, చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ విచారణ చేపట్టారు. కాగా ఇవే ఆరోపణలపై అనకాపల్లి డీఎఫ్‌వో జగన్నాథసింగ్ శుక్రవారం విచారణ జరిపినట్టు తెలిసింది. దీనిపై ముగ్గురు డీఎఫ్‌వోలు త్వరలో భేటీ అయి, విచారణ నివేదిక రూపొందించి సీసీఎఫ్‌కు అందజేస్తారని సమాచారం.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- అధికారులకు కలెక్టర్ విజయ సునీత ఆదేశం
- ఐటీడీఏ స్పందనలో 75 వినతులు స్వీకరణ
- కార్యక్రమానికి గైర్హాజరైన ఐదుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు



ఐటీడీఏలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న కలెక్టర్ ఎం.విజయ సునీత, అధికారులు

పాడేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్పందనలో కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత జిల్లా అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌వో పద్మావతిలతో కలిసి శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖాధికారులకు పంపి సత్వరమే పరిష్కారానికి చొరవచూపాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందని, అందువల్ల పక్కాగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన కార్యక్రమానికి సమయపాలన పాటించాలని, అన్ని శాఖలకు చెందిన అధికారులు విధిగా హాజరుకావాని కలెక్టర్ స్పష్టం చేశారు.

స్పందనలో 75 వినతులు స్వీకరణ

ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 75 వినతులను అధికారులు స్వీకరించారు. పాడేరు మండలం మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టెమ్మ.. తమ పంచాయతీ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలను సరిచేయాలని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. హుకుంపేట మండలం కొట్నాపల్లిలో నల్లరాయి క్వారీ వల్ల తమకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, క్వారీని నిలుపుదల చేయాలని ఆ గ్రామానికి చెందిన కె.చిట్టిబాబు, తదితరులు వినతిపత్రం అందించారు. హుకుంపేట మండలంలో పలు పోలింగ్ కేంద్రాలకు ర్యాంప్‌లు నిర్మించానని, ఈ పనులకు సంబంధించి బిల్లులు మంజూరు చేయాలని జె.వరహాలు అనే కాంట్రాక్టర్ కోరారు. ఇదే మండలం మజ్జివలస నుంచి కొండయ్యపాడు గ్రామం వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని బూర్జ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి హరి వినతిపత్రం సమర్పించారు. చింతపల్లి మండలం అంజలిశనివారం పంచాయతీ మాడెంబంధ గ్రామం నుంచి పాలమామిడి గ్రామానికి రోడ్డు నిర్మించాలని సీహెచ్.రామారావు వినతిపత్రం అందించారు. పాడేరు మండలం వంట్లమామిడి పంచాయతీ నందిగరువు నుంచి 12వ మైలురాయి వరకు రోడ్డు నిర్మించాలని నందిగరువు గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సి.జమాల్‌బాషా, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎం.రాజు, పంచాయతీరాజ్ ఈఈ టి.కొండయ్యపడాల్, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, ఎస్‌డీఎస్ వీవీఎస్.శర్మ, పశు సంవర్థక శాఖ ఉపసంచాలకుడు నరసింహులు, ఐటీడీఏ ఏవో హేమలత, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు రాని ఐదుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు

పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరుకాని ఐదుగురు జిల్లా అధికారులకు కలెక్టర్ విజయ సునీత షోకాజ్ నోటీసులు జారీ చేశారని తెలిసింది. జిల్లా ఖజానా అధికారి ప్రసాద్ బాబు, దేవదాయ శాఖ అధికారి ఎస్.చంద్రశేఖర్, జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎస్.తులసీపద్మ, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కె.అప్పలరాములు స్పందనకు హాజరుకాలేని గుర్తించి కలెక్టర్ వారికి తాఖీలు జారీ చేశారు. స్పందన కార్యక్రమానికి అధికారులు విధిగా హాజరుకావాలని, లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.



డీఈవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నేతలు

టీచర్ల అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలి

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు డిమాండ్

పాడేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయ సిఫారసులతో కొంతమంది ఉపాధ్యాయులకు నిర్వహించిన అక్రమ బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా శాఖలో అక్రమ బదిలీల ప్రక్రియను వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక డీఈవో కార్యాలయం ముందు యూటీఎఫ్ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడారు. అధికార పార్టీ నేతల సిఫారసు, పెద్ద మొత్తంలో డబ్బులు చేతుల మారిన ఉపాధ్యాయుల బదిలీల వ్యవహారంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించాలని, తక్షణమే బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమ బదిలీల వెనుక రాష్ట్ర స్థాయిలో పెద్ద ఎత్తున అవినీతి చేసుకుందని ఆరోపించారు. ఉపాధ్యాయుల బదిలీలను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు కౌన్సెలింగ్ చేపట్టాలని, కానీ విద్యా సంవత్సరం ముగుస్తున్న తరుణంలో అక్రమ బదిలీలకు పాల్పడడం దారుణమన్నారు. విద్యా శాఖ తీరు మారకుంటే యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు సీహెచ్.నాగేశ్వరరావు, ఎస్.గంగాధర్, జిసతీశ్, బి.దుక్కు పాల్గొన్నారు.



దివ్యాంగుల ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, తదితరులు

ఓటు హక్కు వినియోగంపై దివ్యాంగులతో ప్రచారం

పాడేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు దివ్యాంగులతో శుక్రవారం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. 'ఓటు వేయడానికి వెళుతున్నాం' అనే నినాదంతో దివ్యాంగులతో ఐటీడీఏ ముందు ర్యాలీ చేపట్టారు. రాజ్యాంగం కల్పించిన విలువైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.విజయ సునీత కోరారు. ఓటర్లలో స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో దివ్యాంగులతో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ రహీమ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖలో కాంగ్రెస్ బహిరంగ సభ

'సేవ్ విశాఖ-సేవ్ స్టీల్‌ప్లాంట్' నినాదంతో ఉక్కు తృష్ణా మైదానంలో నిర్వహణ

- హాజరుకానున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



స్టీల్‌ప్లాంట్ తృష్ణా మైదానంలో బహిరంగ సభకు ఏర్పాట్లు

విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జోరు పెంచు తోంది. కేడర్‌ను సమాయత్తం చేసే చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహి స్తోంది. ఈ మేరకు శనివారం విశాఖలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉక్కు నగరంలోని తృష్ణా మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖఅతిథిగా హాజరుకానున్నారు. ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు మాణిక్యం ఠాకూర్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతోపాటు సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రులు పల్లంరాజు, జేడీ శీలం, మాజీ ఎంపీ కేవీ రామచంద్రరావు, ఇతర ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. కాగా దీనికి 'న్యాయసాధన సభ' అని పేరు పెట్టినట్టు నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సంబంధించి కాంగ్రెస్ డిక్లరేషన్‌ను సభలో ప్రకటించనున్నారు. కాగా ప్రత్యేక విమానంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర ముఖ్యనేతలు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడి నుంచి సాయంత్రం నాలుగు గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సభకు సుమారు 70 వేల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఉత్తరాంధ్రలోని పార్టీ నేతలు, ఇన్‌చార్జులకు బాధ్యతలను అప్పగించారు. ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం రెండు వేల మందిని తీసుకురావాలని నిర్దేశించారు. కాగా సభా ఏర్పాట్లను శుక్రవారం సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్జపర్తి శ్రీనివాసరావు, ఏపీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేగి వెంకటేశ్, స్టేట్ యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ లక్కరాజు రామారావు, విశాఖ నగర పార్టీ అధ్యక్షుడు గోవింద్, అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు పరిశీలించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.10
సహరి (ఆది)	4.51

ముంచంగిపుట్టులో వైసీపీకి షాక్

- మండల అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి మల్లికార్జునరావు రాజీనామా



వైసీపీకి రాజీనామా చేసిన మల్లికార్జున రావు

ముంచంగిపుట్టు, మార్చి 15: అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ముంచంగిపుట్టు మండలంలో గట్టి షాక్ తగిలింది. దారెల ఎంపీటీసీ సభ్యుడు పి.మల్లికార్జునరావు వైసీపీ మండల అధ్యక్ష పదవితోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మండలం కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా పి.మల్లికార్జునరావు మాట్లాడుతూ, వైసీపీ మండల అధ్యక్షుడుగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని చెప్పారు. అయితే అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్తగా ఇటీవల నియమితులైన హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం తనను కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పర్యటనకు వచ్చినప్పుడు తనకు కనీస సమాచారం ఇవ్వకుండా అవమానపరుస్తున్నారని వాపోయారు. మండలంలో వైసీపీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న తననే ... మిగతా 8వ పేజీలో

ప్రాణం తీసిన గతుకుల రోడ్డు

కేజేపురం జంక్షన్ వద్ద గోతులను తప్పించే క్రమంలో అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- వెనుక నుంచి వస్తున్న సిమెంట్ లారీ ఢీ
- ఎడమవైపునకు భర్తకు, కుడివైపునకు పడిపోయిన భార్య
- మీద నుంచి లారీ వెళ్లడంతో మహిళ అక్కడికక్కడే మృతి
- సొంతూరు ఎం.కోటపాడు
- గాజువాకలో బంధువుల ఇంటిలో ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదం



సంఘటన స్థలం వద్ద అధ్వానంగా వున్న రోడ్డు, ప్రమాదానికి కారణమైన లారీ, వస్త్రం కప్పిన మృతదేహం

మాడుగుల రూరల్, మార్చి 15:

అధ్వానంగా వున్న రహదారుల నిర్వహణలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం మరో నిండు ప్రాణాన్ని బలిగొన్నది. భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, రోడ్డుపై వున్న గోతులను తప్పించే క్రమంలో వెనుక నుంచి వస్తున్న సిమెంట్ లోడు లారీ బలంగా ఢీకొన్నది. దీంతో భర్త ఎడమ వైపునకు, భార్య కుడివైపునకు పడిపోయారు. ఈ క్రమంలో లారీ ఆమె మీదుగా దూసుకుపోయింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. మాడుగుల మండలం కేజేపురం జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలిలా వున్నాయి.



గోల్కొండ సత్యవతి (ఫైల్)

మాడుగుల మండలం ఎం.కోటపాడు గ్రామానికి చెందిన గోల్కొండ ఈశ్వరరావు, సత్యవతి (45) దంపతులు. ఈశ్వరరావు కుల వృత్తిపై (బార్బర్ షాపు) ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం విశాఖ నగరంలోని గాజువాక ప్రాంతంలో బంధువుల ఇంటిలో శుభ కార్యానికి హాజరుకావడానికి భార్యభర్తలు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. శుక్రవారం ఉదయం తిరిగి ఎం.కోటపాడు బయలుదేరారు. సుమారు ఏడున్నర గంటల సమయానికి వడ్డాది-పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో కేజేపురం జంక్షన్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ రహదారి మొత్తం గోతులు ఏర్పడి పూర్తిగా ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, మార్చి 15: మార్టూరులో యువకుడు ఆత్మహత్యపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ వి. సత్యనారాయణ తెలిపారు. మార్టూరు గ్రామానికి చెందిన కర్రి రామకృష్ణ (32) ఫార్మాకంపెనీలో పనిచేస్తున్నాడన్నారు. అవివాహితుడైన రామకృష్ణ డ్యూటీకి సరిగా వెళ్లకపోవడంతో గురువారం మధ్యాహ్నం తండ్రి ఉమామహేశ్వరరావు మందలించాడన్నారు. సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు వచ్చిన రామకృష్ణ తిరిగి ఇంటికి చేరలేదన్నారు. శుక్రవారం ఉదయం బొజ్జన్నకొండకు వెళ్లే మార్గంలోని ఏలేరు కాలువ గట్టు పక్కన అపస్మారకస్థితిలో పడి ఉన్న రామకృష్ణను తెలిసిన వారు చూసి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారన్నారు.వెంటనే కుటుంబసభ్యులు తుమ్మపాల పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించిన అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు అన్న రామచంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వెంకటఅప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

రైలు కింద పడి యువకుడు...


శివగణేష్ (ఫైల్)

ఎస్.రాయవరం, మార్చి 15: మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో చందక శివ గణేష్ (18) శుక్రవారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ మారూఫ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్, గుల్లిపాడు రైల్వే స్టేషన్‌ల మధ్యలో శుక్రవారం ఉదయం రైలు పట్టాలపై యువకుడు మృతి చెందినట్టు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్, సిబ్బంది ఆ ప్రదేశానికి వెళ్లి మృతుడిని పరిశీలించారు. మృతుడు గురించి వాకబు చేయగా ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం గ్రామానికి చెందిన చందక శివ గణేష్ (18)గా గుర్తించారు. శివ గణేష్ ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయం తల్లికి తెలియడంతో ఆమె మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శివ గణేష్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసిందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. శివగణేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతం అయ్యారు.

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వివాహిత...

» అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పరవాడ, మార్చి 15: ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన గురువారం కలపాకలో చోటుచేసుకుంది. అయితే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కలపాక గ్రామానికి చెందిన ఈతలపాక మూల వెంకటరావు, శ్యామల భార్యాభర్తలు. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు పవన్ సాయి ఉన్నాడు. శ్యామల కొంతకాలంగా మానసిక ఒత్తిడితో బాధపడుతుంది. భర్త వెంకటరావు ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం భర్త డ్యూటీకి వెళ్లిపోగా కుమారుడు పాఠశాలకు వెళ్లాడు. స్కూల్ నుంచి సాయంత్రం నాలుగు గంటలకు కుమారుడు పవన్‌సాయి ఇంటికి వచ్చేసరికి తల్లి బెడ్‌రూములో ఫ్యాన్ ఉక్కుకు వేలాడుతూ కనిపించింది. దీంతో భోరున ఏడవడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆమెను కిందకు దించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందింది. మృతదేహానికి ఎన్టీఆర్‌వైద్యాలయంలో పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతురాలి సోదరుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ మల్లేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

» మైక్ సెట్ బిగిస్తుండగా ప్రమాదం

» కొండెంపూడి జగనన్న కాలనీ గృహ ప్రవేశం ఏర్పాట్లలో ఘటన


మృతి చెందిన సత్తిబాబు

బుచ్చెయ్యపేట, మార్చి 15 : మైక్‌సెట్ బిగిస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. మండలంలోని కోమళ్లపూడికి చెందిన గేదెల సత్తిబాబు (39) మైక్ సెట్ ఓనర్. వివాహ శుభకార్యాలకు మైక్‌సెట్ అద్దెకు ఇస్తుంటాడు. శనివారం తెల్లవారుజామున కొండెంపూడిలోని జగనన్న కాలనీలో తమ గృహ ప్రవేశానికి మైక్‌సెట్ పెట్టాలని గ్రామానికి చెందిన ఆది శ్రీధర్ సత్తిబాబును కోరాడు. దీంతో శుక్రవారం రాత్రి మైక్ సెట్ బిగిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. సత్తిబాబు మృతదేహాన్ని శ్రీధర్, మరో యువకుడు కొండెంపూడి నుంచి బైక్‌పై తీసుకొచ్చి కోమళ్లపూడి వాటర్ ట్యాంకు సమీపంలో పడేశారు. ఈ విషయాన్ని మృతుడి బంధువుకు గణేష్‌కు శ్రీధర్ ఫోన్ చేసి తెలిపాడు. సత్తిబాబు ప్రాణంతో ఉన్నాడని భావించిన గణేశ్ రావికమతం ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. వైద్యుడు పరీక్షించి అప్పటికే అతడు మృతిచెందినట్టు తెలిపారు. దీంతో సత్తిబాబు మృతదేహాన్ని బైక్‌పై ఆస్పత్రి నుంచి కొత్త కొండెంపూడికి తీసుకెళ్లి విద్యుత్ షాక్ గురై చనిపోయిన స్థలంలోనే గణేశ్, మృతుడి బంధువులు పడివేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మృతుడి బంధువులు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

లంకెలపాలెం, మార్చి 15: పరవాడ మండలం పెదముషిడివాడలో శుక్రవారం ఒకరు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్న ఎ. వెంకట ఆదిత్యశివ (46) నెల రోజుల క్రితం పెదముషిడివాడలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఈయన ఒంటరిగా ఇంటిలో ఉంటున్నారు. ఈయన భార్య, తల్లిదండ్రులు గతంలో మృతి చెందారు. అయితే ఆదిత్యశివ ఇంట్లో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

» హత్యకు గురైన వ్యక్తి బాటిల్స్, కాగితాలు ఏరుకొనే దుర్గాప్రసాద్‌గా గుర్తింపు

ఎస్.రాయవరం, మార్చి 15: ఈనెల 2వ తేదీన మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో హైవే పక్కనే గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును ఎస్. రాయవరం పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురుని పట్టుకున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎస్‌ఐ విభీషణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 2వ తేదీన అడ్డరోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నడుంపూడి గ్రామానికి చెందిన మటపాత్రుని దుర్గాప్రసాద్ (36)గా పోలీసులు గుర్తించారు. మృతుడు దుర్గాప్రసాద్ మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ చుట్టు పక్కల ప్రాంతాల్లో కాగితాలు, బాటిల్స్ ఏరుకొని జీవనం సాగిస్తున్నాడు. అయితే దుర్గాప్రసాద్‌కు అదే వృత్తిలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆ ముగ్గురు పథకం ప్రకారం ఈనెల ఒకటో తేదీ సాయంత్రం దుర్గాప్రసాద్‌కు ఎక్కువగా మద్యం తాగించారు. రాత్రికి కోనవానిపాలెం జంక్షన్‌కు సమీపంలో హైవే పక్కకు తీసుకొని వచ్చి దుర్గాప్రసాద్ కాళ్లు, చేతులు కట్టి కత్తితో పొడిచి చంపినట్టు దర్యాప్తులో తేలిందని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ అప్పన్న, ఎస్.రాయవరం, కోటవురట్ల ఎస్‌ఐలు, సిబ్బందిని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429

ఉపమాక వెంకన్న ఉత్సవాలకు చకచకా ఏర్పాట్లు

» 19 నుంచి 25వ వరకూ వార్షిక కల్యాణోత్సవాలు


ఆలయం బయట భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రేకు షెడ్

నక్కపల్లి, మార్చి 15: ఉపమాకలో వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతీఏటా ఫాల్గుణశుద్ధ ఏకాదశి రోజున స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. గరుడాద్రి పర్వతం(కొండ)పైకి వెళ్లే మెట్ల మార్గాన్ని సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన రాజగోపురం, ఇతర గోపురాలు, బేడా మండపం, ఆస్థాన మండపం, ఇతర కట్టడాలను రంగులతో ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణలో గాలిగోపురం ఎదురుగా భక్తుల సౌకర్యార్థం ఎండ తీవ్రత లేకుండా తాత్కాలిక రేకు షెడ్డుఏర్పాటు చేశారు. ఈనెల 19న ఉత్సవాలకు అంకురార్పణ, 20న ధ్వజారోహణం, కల్యాణోత్సవం, రథోత్సవం వంటి కార్యక్రమాలు జరుగుతాయని ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు చెప్పారు. ఈ సంవత్సరంలో అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అంచనావేస్తున్నారు.


కింద ఆలయ దృశ్యం

20 రోజుల పాటు తీర్థం

స్వామివారి ఉత్సవాలు సందర్భంగా ఉపమాకలోనే 20 రోజులపాటు తీర్థం సాగుతుంది. పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అనేక దుకాణాలను ఏర్పాటు చేస్తారు. ఈ జాతరలో సుగంధ ద్రవ్యాల వ్యాపారం 20 రోజులపాటు రూ.కోట్లలో జరుగుతుంది. ఏడాది పాటు ఇంటిలో వండే వంటలకు సరిపడే విధంగా సుగంధ ద్రవ్యాలను కొనుగోలు చేస్తుంటారు. వీటితోపాటు తినుబండారాలు, ఇతర సరుకులను విక్రయించే దుకాణాలు ఏర్పడతాయి.

కాపు లేని జీడిమామిడి

» పెట్టుబడులు దక్కే పరిస్థితులు కానరాలేదని రైతులు ఆందోళన



నాతవరంలో ఇప్పటికీ పూతదశలో ఉన్న జీడిమామిడి తోటలు (ఇన్‌సెట్‌లో) తెగుళ్లు, పొగమంచు ప్రభావంతో మాడిపోతున్న జీడిమామిడి పిందెలు

నాతవరం, మార్చి 15: మండలంలో వరి తర్వాత ఎక్కువ విస్తీర్ణంలో జీడిమామిడి తోటలు వున్నాయి. ఉద్యావన శాఖ అధికారుల గణాంకాల ప్రకారం సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో జీడిమామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. అయితే గత ఏడాది వర్షాలు సరిగా పడకపోవడంతో జీడిమామిడి తోటల్లో పూత ఆలస్యంగా వచ్చింది. సాధారణంగా ఏటా ప్రస్తుత సమయానికి తోటల్లో పిందెలు కనిపించేవి. కానీ ఈ ఏడాది నాలుగింట మూడొంతుల తోటలు ఇంకా పూత దశలోనే వున్నాయి. గత నెలలో పూత వచ్చే సమయంలో పొగమంచు దట్టంగా కురవడంతో చాలా వరకు పూత మాడిపోయింది. మరోవైపు తెగుళ్లు దాడి చేయడంతో వీటి నియంత్రణ కోసం రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాల్సి వచ్చింది. అయినా సరే చాలా వరకు పూత రాలిపోయింది. ఇప్పటి వరకు ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టుబడి అయ్యిందని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరాకు రెండు బస్తాలకు (ఒక్కో బస్తా 80 కిలోలు) మించి జీడిపిక్కల దిగుబడి వచ్చే అవకాశం లేదని అంటున్నారు. 2020లో బస్తా జీడిపిక్కలు రూ.12 వేలు పలికిందని, గత ఏడాది రూ.7 వేలకు పడిపోయిందని, ఈ ఏడాది ఇదే ధర వుంటే పెట్టుబడి కూడా చేతికి రాదని రైతులు వాపోతున్నారు.

ట్రయల్ కోర్టులో వాదనలే లా విద్యార్థులకు కీలకం

» హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు


వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు

సబ్బవరం, మార్చి 15: న్యాయ విద్యార్థులకు ట్రయల్ కోర్టులో వాదనలే కీలకమని, ట్రయల్ కోర్టులో ప్రాక్టీస్ వలన ఫైలింగ్ దగ్గర నుంచి పూర్తయ్యేంతవరకూ వివిధ దశలపై అవగాహన ఏర్పడుతుందని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు పేర్కొన్నారు. మండలంలోని అసకపల్లి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం వర్సిటీకి చెందిన ప్రో బోనో క్లబ్, లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో 'ది ట్రయల్ అడ్వకసీ'పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ సోమయాజులు మాట్లాడుతూ.. ట్రయల్ కోర్టులో అనుభవం వలన న్యాయవాద వృత్తిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి దశలో ఎదురయ్యే సమస్యలు, వాటిని ఎలా డిపెండ్ చేసుకోవాలో నేర్చుకోవచ్చునన్నారు. ట్రయల్ కోర్టు ప్రాక్టీసు తరువాత మాత్రమే హైకోర్టులకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. కేసుకు సంబంధించిన ఆధారాల సేకరణలో జాగ్రత్త ఎంతో అవసరమన్నారు. వీసీ ప్రొఫెసర్ సూర్య ప్రకాశరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు అవదేశ్ నారాయణ్ సింఘీ, శ్రీప్రసన్న స్వామినాథన్, శ్రీ శరత్‌చంద్ర, ప్రశాంత్‌కుమార్, న్యాయవాదులు, కో-కన్వీనర్లు, కమిటీ సభ్యులు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ నందిని సీపీ, పీటీసీ చైర్‌పర్సన్ బీవీఎస్ సునీత, డాక్టర్ సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి అవకాశమిస్తే రాష్ట్రం రావణకాష్ఠమే

» టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ


వేదికపై గాజు గ్లాసు గుర్తును చూపిస్తున్న నాయకులు

తుమ్మపాల, మార్చి 15 : వైసీపీకి మరోసారి అవకాశమిస్తే రాష్ట్రం రావణకాష్టంలా మారడం ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. శుక్రవారం రాత్రి తుమ్మపాలలో జరిగిన మూడు పార్టీల నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన ప్రారంభం నుంచి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేని చేతకాని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ దఫా ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. అమరావతి రైతులతో పాటు రాష్ట్ర రైతాంగాన్ని మోసగించిన ఏకైక వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. రైతుల శాపం జగన్మోహన్‌రెడ్డి తగలడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, కేంద్రంలో ప్రధానిగా నరేంద్రమోదీతోనే సుభిక్ష పాలన సాగుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు పునర్నిర్మాణం కోసమే జనసేన పావులు కదుపుతుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వర రావు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు నాయకులంతా కృషి చేయాలన్నారు.

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సర్వనాశనం చేసిన ఘనుడు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అని అన్నారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే మూసేసిన ఘనుడు మంత్రి గుడివాడ అని అన్నారు. ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబి, పచ్చికూర రాము, నారపిన్ని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 26 మంది జేఎల్స్‌కు ఉద్యోగోన్నతి

విశాఖపట్నం, మార్చి 15 : ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 26 మంది లెక్చరర్లు ప్రిన్సిపాళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు. విశాఖ జిల్లాలో 15 మందికి ఈ అవకాశం లభించగా అనకాపల్లి నుంచి 9, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇద్దరు పదోన్నతి పొందారు. విశాఖ జిల్లాలో డాక్టర్ వీఎస్ కృష్ణ జూనియర్ కళాశాల లెక్చరర్లు ఎస్.నాగమణిని కె.కోటపాడు, అన్నపూర్ణను వడ్డాది, పి. మంజులను రోలుగుంట, ఎం.విజయ కుమార్‌ను సోంపేట కళాశాలలకు ప్రిన్సిపాళ్లుగా బదిలీ చేశారు. మహిళా జూనియర్ కళాశాల లెక్చరర్లు కె. శ్రీదేవిని నక్కపల్లి, బీవీ పద్మావతిని నర్సీపట్నం, ఏఆర్‌టీ సుజాతను కోటవురట్ల కళాశాలలకు, పెందుర్తి కళాశాల లెక్చరర్లు పి. ఆనంద్‌కుమార్‌కు కోటబొమ్మాళి, పి. అరుణకుమారిని అరుకువేలి, కె. శ్రీహరికి కేడీపేట, పి. యతేంద్రనాథ్‌కు కొత్తూరు, యూవీఎన్ వర్మకు తోగరం, ఎండీ లలితకుమారిని పెందుర్తి కళాశాలకు బదిలీ చేశారు. కృష్ణ ఒకేషనల్ కళాశాల లెక్చరర్లు ఆర్‌జీ మహేశ్వరరావుకు బారువ, వి. శంకరరావుకు ఇచ్ఛాపురం కళాశాలలకు ప్రిన్సిపాళ్లుగా నియమించారు. అనకాపల్లి జిల్లాలోని చోడవరం కళాశాల లెక్చరర్లు ఎం. భరతశ్రీకు మాకవరం, మాడుగుల కళాశాల లెక్చరర్ ఎస్. శ్రీనివాసరావును పాడేరు, మాకవరపాలెం కళాశాల లెక్చరర్ కె. గోవిందరావును చింతపల్లి, పరవాడ కళాశాల లెక్చరర్లు ఎ. శోభను నర్సీపట్నం, వి. సుశీల్‌కుమార్‌ను సారవకోట, ఎంపీ స్వామినాయుడును దుంబ్రిగుడ బదిలీ చేశారు. దేవరపల్లి లెక్చరర్ జె. వివేకనందరావును కవిటి, సబ్బవరం లెక్చరర్ ఎల్. సత్యవతిని కొత్తకోట, యలమంచిలి లెక్చరర్ వి. పద్మజను యలమంచిలి బదిలీ చేశారు. అలాగే అల్లూరి జిల్లాలోని ముంచంగుపుట్టు కళాశాల లెక్చరర్ కె. కొండన్నదొరను అదే కళాశాల ప్రిన్సిపాల్‌గా, అనంతగిరి లెక్చరర్ కె. ప్రమీలను కూడా అదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించారు. హుకుమ్‌పేట కళాశాలకు సీహెచ్ రాంబాబు (కొత్తవలస), జి.మాడుగుల కళాశాలకు ఎ.గౌరీప్రసాద్ (డెంకాడ) ప్రిన్సిపాళ్లుగా పదోన్నతిపై వచ్చారు.

19లోగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ తరలింపు

» రికార్డుల పరిశీలనకు అనుమతించండి

» ఆర్టీఐ ఎస్‌సీఐసీ ఆర్.మహబూబ్ బాషా ఆదేశాలు

అనకాపల్లి టౌన్, మార్చి 15: అనకాపల్లి జాయింట్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తరలింపు రికార్డుల పరిశీలనకు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తుదారుల్ని అనుమతించాలంటూ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (ఎస్‌సీఐసీ) ఆర్.మహబూబ్ బాష ఆదేశించారని ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లు దాటవేత ధోరణితో పొంతన లేని సమాధానాలివ్వడం పట్ల శుక్రవారం ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయం తరలింపు ఫైళ్లు పరిశీలన విషయమై రాష్ట్ర సమాచార కమిషన్‌లో దాఖలైన కేసు వర్చువల్ విధానంలో ఆయన విచారించారని తెలిపారు. దరఖాస్తుదారు కోరిన రికార్డులను తక్షణం 19లోగా పరిశీలనకు అనుమతించాలని ఆదేశించారన్నారు. విచారణలో తనతోపాటు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్. జానకీదేవి, సబ్‌రిజిస్ట్రార్ ఎస్. బసవేశ్వరరావు పాల్గొన్నారన్నారు.

3 వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట, మార్చి 15 : మండలంలో శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 3 వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసి, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. పాయకరావుపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.ధర్మారావు అందజేసిన వివరాలిలా ఉన్నాయి. ఎస్‌ఈబీ జిల్లా అధికారులకు అందిన పక్కా సమాచారంతో శుక్రవారం అనకాపల్లి ఏఈఎస్ డి. శైలజరాణి, డీటీఎస్ ఇన్‌స్పెక్టర్ షేక్ మీరాసాహెబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పాతపేటలో దాడి చేసి పది లీటర్ల సారాతో ఒకరిని అరెస్టు చేశామన్నారు. అలాగే అరట్లకోట గ్రామ సమీపంలో మరో వ్యక్తి వద్ద 20 లీటర్ల సారాతో అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా పట్టణ శివారు ధారకొండ ప్రాంతంలో సారా తయారీకి నిల్వ ఉంచిన 3వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ స్టేషన్ ఎస్‌ఐ పి.జాన్‌ప్రసాద్, అనకాపల్లి డీటీఎఫ్ ఎస్‌ఐ పి.శాంతిలక్ష్మి, ఎలమంచిలి ఎస్‌ఈబీ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారని సీఐ తెలిపారు.


చంద్రబాబు సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

రావికమతంలో చంద్రబాబు ఎన్నికల సభ

» 22 నుంచి 25వ తేదీల మధ్య ఉండవచ్చు

» స్థల పరిశీలన జరిపిన మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం, మార్చి 15 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం ఎన్నికల సభను రావికమతంలో నిర్వహించనున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు తెలిపారు. తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ ఈ నెల 22 నుంచి 25వ తేదీ మధ్య ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి సభా స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావికమతం- గర్నికం మధ్యనున్న లేఅవుట్‌లోని ఖాళీ స్థలంలో సభ నిర్వహిస్తే ఎలా ఉంటుందోనన్న ఆలోచన చేస్తున్నామన్నారు. సభ వలన ట్రాఫిక్‌కు, వచ్చి పోయేవారికి ఎటవంటి ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో స్థల పరిశీలన జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదు నాయుడు, మురుపాక ఎంపీటీసీ ముత్సా సూర్యనారాయణ, వేపాడ నాగేశ్వరరావు, ఉప్పులూరి నాగేశ్వరరావు, గోకివాడ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీకి పరుచూరి భాస్కరరావు రాజీనామా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరుచూరి భాస్కరరావు

కొత్తూరు, మార్చి 15: జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కొద్ది రోజులుగా విజయవాడలో ఉండి ప్రయత్నించినప్పటికీ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అపాయింట్‌మెంట్ దొరకలేదనే బాధతో ఆ పార్టీకి రాజీనామా చేశానని చెప్పారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు సీటు కేటాయించినప్పటికీ పార్టీకి సేవ చేద్దామమని అనుకున్నానన్నారు. తాను ఏ పార్టీలోనూ చేరనని, రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని ప్రకటించారు. అభిమానులు, కార్యకర్తలు ఎవరి నిర్ణయం వారే తీసుకోవచ్చన్నారు. తన రాజీనామా లేఖను ప్రదర్శించి పార్టీ అధినేతకు పంపించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

» రక్షణ కల్పించాలని నర్సీపట్నం సీఐకు వినతి

» వివాహం చేసుకున్నందుకు తమపై దాడి చేశారని ఆరోపణ


పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రేమ జంట

నర్సీపట్నం, మార్చి 15 : ప్రేమ వివాహం చేసుకున్న తమకు రక్షణ కల్పించాల్సిందిగా కీర్తిక, చంద్రశేఖర్ జంట నర్సీపట్టణ సీఐ కాంతికుమార్‌ను శుక్రవారం కోరారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన పూసపాటి చంద్రశేఖర్ (24), ఎన్ఏడీ కాకాని నగర్‌కు చెందిన కె.నిధి కీర్తిక (22) గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. పెద్దలకు చెప్పకుండా ఫిబ్రవరి 14న తిరుపతిలో వివాహం చేసుకున్నారు. వేర్వేరు కులాలు కావడంతో కీర్తిక తండ్రి వీరి ప్రేమ వివాహాన్ని అంగీకరించ లేదు. దీంతో చంద్రశేఖర్‌పై కిడ్నాపింగ్ కేసు పెట్టారు. ఇద్దరూ మేజర్లు కావడంతో పెళ్లి చేసుకున్నట్టు అధికారికంగా మేరేజ్ సర్టిఫికేట్ ఉండాలని కొంత మంది చెప్పడంతో ఈనెల 13వ తేదీన సింహాచలంలో మరోసారి వివాహం చేసుకున్నారు. ఇదిలావుంటే, గురువారం విశాఖపట్నంలో కొంత మంది దాడి చేసి కొట్టారని ఆ ఫిర్యాదులో వారు ఆరోపించారు. వారి నుంచి తప్పించుకొని నర్సీపట్నం శారదానగర్‌లోని ఒక లాడ్జీలో దిగామని, రాత్రి అక్కడికి కూడా వారు వచ్చి కొట్టారని బాధితులు విలేకరుల వద్ద వాపోయారు. శుక్రవారం ఉదయం పట్టణ సీఐ కాంతికుమార్‌ను కలిసి తన తండ్రి బారినుంచి తమకు రక్షణ కల్పించాలని యువతి కోరింది. దీనిపై సీఐని వివరణ కోరగా, యువతీ యువకులు ఇద్దరూ మేజర్లే అని తెలిపారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామంటే పంపించామని వివరించారు.

అటవీ శాఖ డీఆర్‌వోకు పదోన్నతిపై బదిలీ


కేవీ రాజేశ్

కృష్ణాదేవిపేట, మార్చి 15: గొలుగొండ, కొయ్యూరు మండలాల పరిధిలో గల కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ కార్యాలయంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ రాజేశ్‌కు పదోన్నతిపై అల్లూరి జిల్లా పెదబయలు రేంజ్ కార్యాలయానికి బదిలీ అయ్యింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం ఆయనకు అందాయి. ఏడాదిన్నరగా రాజేశ్ ఇక్కడ సమర్థవంతమైన సేవలు అందిస్తున్నారు. రేంజ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన ఆయనను కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు నాయకులు అభినందించారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 15: జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది ఏ విద్యార్థి కూడా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా విద్యాశాఖ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో ఏ ఒక్క విద్యార్థి డిబార్ కాలేదు. జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షకు 11,660 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్‌బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 12,122 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 462 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదని ఆమె తెలిపారు.

పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్

అనకాపల్లి రూరల్, మార్చి 15: జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో తొమ్మిది మంది ఉద్యోగులు వారి సమస్యలను ఎస్పీ కేవీ మురళీకృష్ణకు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయసునీత, జేసీ, సబ్ కలెక్టర్ తదితరులు

ఓటింగ్‌పై అవగాహనకు పోస్టర్లు ఆవిష్కరణ

పాడేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముద్రించిన పది రకాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లాలో ఓటర్లకు ఓటింగ్‌పై అవగాహన కల్పించేందుకుగానూ ఈ పోస్టర్లను వినియోగిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్, సబ్ కలెక్టర్ వి.ధాత్రిరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం

» అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



చుట్టుబంధలో వినాయకుని గుడి నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న ఎంపీ

కొయ్యూరు, మార్చి 15: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం సాధ్యమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి చెప్పారు. మండలంలో శుక్రవారం పర్యటించిన ఆమె, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో చుట్టుబంధ, పరదేశిపాకలు, దిబ్బలవీధి గ్రామాలలో మంజూరు చేసిన రామాలయం, వినాయక ఆలయం నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎంపీని సత్కరించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ఆలయాలు నిలయాలన్నారు. అందరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధి మల్లిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టిబాబు, పండితులు పాల్గొన్నారు.

నోటీసు బహిరంగ వేలం పాట

అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, గుత్తులపుట్టు గ్రామ పంచాయితీ, జి.కొత్తూరు (సంతబయలు)లో జరుగు వారపుసంత ఆశీలు వేలంపాట 2024-25 సంవత్సరానికి బహిరంగ వేలం పాట తే.18-03-2024ది సోమవారం ఉదయం గం.10.30 ని.లకు గ్రామ పంచాయితీ కార్యాలయం నందు సర్పంచ్ శ్రీ సాగిని బాబూరావు పడాల్ గారి అధ్యక్షతన నిర్వహించబడును. వేలంపాటలో పాల్గొను వారు రూ.5000/- (అక్షరాల అయిదు వేల రూపాయిలు) మాత్రమే దరావత్తు చెల్లించి పాట పాడుకోవలెను. కావున ఆసక్తి గల యువతీ, యువకులు, గ్రామ పంచాయితీకి చెందిన ప్రజలు వేలం పాటలో పాల్గొనవలెను. గుత్తులపుట్టు గ్రామ పంచాయితీకి చెందినవారు మాత్రమే అర్హులు.

వంతాల పరశురాం
పంచాయతీ సెక్రటరీ - గుత్తులపుట్టు,
పాడేరు మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా

గుత్తులపుట్టు,
తేది.14-03-2024

కొట్నాపల్లి నల్లక్వారీని మూసేయండి

» సీపీఐ నాయకుల డిమాండ్

» బాధితులతో కలిసి స్పందనలో ఫిర్యాదు



బాధితులతో కలిసి స్పందనలో ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

పాడేరు రూరల్, మార్చి 15: హుకుంపేట మండలం కొట్నాపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీని శాశ్వతంగా మూసివేయాలని సీపీఐ నాయకులు అమర్, చంటి డిమాండ్ చేశారు. బాధిత గ్రామాల ప్రజలు శుక్రవారం ఐటీడీఏలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్ విజయసునీత, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, జేసీ బావన వశిష్టకు ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి స్పందిస్తూ పనులు నిలుపుదల చేయాలని అప్పటికే ఆదేశించినట్టు ఏడీ మైన్స్ వివరించారన్నారు. అయితే తాత్కాలికంగా క్వారీ పనులు నిలిపివేసి, హైవే పనులు చేపట్టే సమయంలో క్వారీ పనులు చేపడతారన్నట్టు ఏడీ మైనింగ్ చెప్పడంతో క్వారీ పరిసర గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. క్వారీ పనులు చేపట్టడం, నల్లరాయి పగలకొట్టేందుకు కొద్ది నెలలుగా రాత్రి 7 గంటల తరువాత బాంబు బ్లాస్టులు చేయడం, తెల్లవార్లు క్వారీ నడపడం వల్ల తమ గృహాలు బీటలు వారడంతో పాటు దుమ్ము ధూళికి చిన్నారులు రోగాల బారిన పడుతున్నారని, తాము వేసుకొనే పంటలు దెబ్బతింటున్నాయని బాధిత గ్రామాల ప్రజలతో పాటు సీపీఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్వారీ నిలుపుదల విషయమై కలెక్టర్ సానుకూలంగా స్పందించడంపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. క్వారీ నిర్వహణ పనులు శాశ్వతంగా నిలుపుచేయకపోతే కొట్నాపల్లి, కొత్తవలస, చక్రిపుట్టు, సువ్వాపాడు, మారెల, పెద్దగరువు, మత్స్యపురం, నిమ్మలపాడు, యూ.బొడ్డాపుట్టు బాధిత గ్రామాల ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బాలకృష్ణ, గ్రామ పెద్దలు, సంఘ నాయకులు గెమ్మెలి ప్రసాద్, కొర్రా పోతురాజు, సత్యారావు, లక్ష్మయ్య, చంటిబాబు, రామన్నదొర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలు: ఎంపీడీవో

చింతపల్లి, మార్చి 15: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని ఎంపీడీవో వీర సాయి బాబు అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ప్రవర్తన నియమావళి అమలు చేసే బాధ్యత కార్యదర్శులపై ఉంటుందన్నారు. షెడ్యూల్ వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల పోస్టర్లు తొలగించాలన్నారు. గ్రామ, పంచాయతీ స్థాయిలో నియమావళి అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వీరసాయిబాబు



ఏఎన్ఎంపై సరెండర్‌ను ఎత్తివేయాలని ఐటీడీఏ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఏఎన్ఎంపై సరెండర్ ఎత్తివేయాలని ఆందోళన

పాడేరు రూరల్, మార్చి 15: నిబంధనలకు వ్యతిరేకంగా గ్రేడ్-3 ఏఎన్ఎం చంద్రమ్మపై గోమంగి పీహెచ్‌సీ వైద్యాధికారి జారీ చేసిన సరెండర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నాయకులు శుక్రవారం ఆందోళనకు దిగారు. పంచాయతీ ప్రజలతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు. అలాగే స్పందనలో వినతిపత్రం అందించారు. పెదబయలు మండలం గోమంగి పీహెచ్‌సీ పరిధిలోని బొండాపల్లి సచివాలయంలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎం డి.చంద్రమ్మకు వైద్యాధికారి కక్షపూరితంగానే సరెండర్ చేశారని సీఐటీయూ జిల్లా నేత ఎల్.సుందరరావు, పొయిపల్లి పంచాయతీ ప్రజలు పేర్కొన్నారు. చంద్రమ్మ గ్రామాల్లో చక్కగా విధులు నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఆమె విధులను సక్రమంగా నిర్వహించకుంటే అధికారులకు తామే ఫిర్యాదు చేస్తామన్నారు. వైద్యాధికారి ఉద్దేశపూర్వకంగానే ఏఎన్ఎంపై ఉన్నతాధికారులకు తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. వైద్యాధికారి పద్ధతి మార్చుకొని సరెండర్‌ను ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

‘ఉన్నతి’లో ఉపాధికి 73 మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

డుంబ్రిగుడ, మార్చి 15: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధి అవకాశాల కల్పనకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 73 మంది ఎంపికయ్యారని ఎంపీడీవో జయఉమ తెలిపారు. వంద రోజులు పని దినాలు పూర్తిచేసిన గిరిజన నిరుద్యోగులకు ఉపాధి పథకం ఏపీవో దొరబాబు, ఉన్నతి జాబ్ కార్డు కో-ఆర్డినేటర్ బొజ్జన్న ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులు నచ్చిన అంశాల్లో శిక్షణ పొందేందుకు వీలుగా ఎంపిక చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ మాట్లాడుతూ ఉన్నతి ద్వారా ఉచిత శిక్షణ పొంది స్వయం ఉపాధికి ఊతమిచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాబ్‌కార్డు లబ్ధిదారులు, ఎన్ఆర్ఇజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడేరు అసెంబ్లీ స్థానం టీడీపీకే కేటాయించాలి

» తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీ.సురేశ్‌కుమార్

పాడేరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పాడేరు అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీకే కేటాయించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకటసురేశ్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఇంటి వద్ద టీడీపీ ముఖ్య నేతలు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్‌కుమార్ మాట్లాడారు. స్థానిక అసెంబ్లీ స్థానంలో తెలుగుదేశం పార్టీ అతి సునాయాసంగా విజయం సాధిస్తుందని, ఈ తరుణంలో పొత్తుల్లో భాగంగా వేరే పార్టీలకు కేటాయించడం వల్ల టీడీపీ నష్టం కలుగుతుందని చెప్పారు. ఇప్పటికైనా అధిష్ఠానం పునరాలోచించాలని కోరారు.

చింతపల్లి/జి.మాడుగుల/గూడెంకొత్తవీధి: పాడేరు టికెట్ టీడీపీ అభ్యర్థికే కేటాయించాలని నియోజకవర్గంలోని చింతపల్లి, జి.మాడుగుల, జీకే వీధి మండలాల నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు శుక్రవారం నాయకులు సమావేశమయ్యారు. గిడ్డి ఈశ్వరికి టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారన్నారు. జి.మాడుగుల పార్టీ కార్యాలయంలో మండల నేతలు చిట్టిబాబు, కొండలరావు, కల్యాణం, శాంతికుమారి, చిరంజీవినాయుడు, లక్ష్మణ్‌రావు, రమణబాబు, ఈశ్వరరావు, సింహాచలం, చిట్టిబాబు, సన్యాసిరాజు సమావేశమై గిడ్డి ఈశ్వరికి టిక్కెట్ కేటాయించాలని ముక్తకంఠంతో కోరారు. గూడెంకొత్తవీధి తెలుగు యువత అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై అసెంబ్లీ టికెట్ టీడీపీకి కేటాయించాలని తీర్మానం చేశారు.

30 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి మూటలు, స్మగ్లర్లతో పోలీసులు

ముంచంగిపుట్టు, మార్చి 15: మండలంలోని జోలాపుట్టు సమీపంలో స్థానిక పోలీసులు 30 కిలోల గంజాయిని పట్టుకున్నారు. తిఇందుకు సంబంధించిన ఎస్ఐ కె.రవీంద్ర అందించిన వివరాలిలా ఉన్నాయి. కారులో గంజాయి రవాణా అవుతున్నట్టు స్టేషన్‌కు పక్కా సమాచారం అందింది. దీంతో జోలాపుట్టు సమీపంలో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. జోలాపుట్టు మీద నుంచి ఒడిశా వైపు వెళ్లేందుకు వస్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేయగా, అందులో గంజాయి పట్టుబడింది. 30 కిలోల గంజాయితో పాటు కారు, ఒక సెల్ ఫోన్, ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. నిందితులు ముంచంగిపుట్టు మండలంలో గల గిద్దులపుట్టు గ్రామానికి చెందిన జె.కృష్ణ, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పనసపుట్టు గ్రామానికి చెందిన కె.రూబెన్‌లు తేలింది. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఏఎస్ఐ కె.లక్ష్మయ్య, పీసీ వి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్‌లో గిరిజన విద్యార్థినికి తృతీయ స్థానం



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని ద్రాక్షాయిని, హెచ్‌ఎం

గూడెంకొత్తవీధి, మార్చి 15: మండలంలోని పెదవలస పంచాయతీ చాపరాతిపాలెం పాఠశాల మూడో తరగతి విద్యార్థిని రాష్ట్ర స్థాయి వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం సాధించినట్టు ఎంఈవో తగ్గి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థిని రాటా ద్రాక్షాయిని లీప్ ఫర్ వర్డ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి తృతీయ స్థానం సాధించిందన్నారు. గిరిజన విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చడం సంతోషకరమన్నారు. విద్యార్థిని తీర్చిదిద్దిన హెచ్‌ఎం సీదరి కల్యాణం, ఉపాధ్యాయుడు కుమార్, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 రామన్న పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

పాడేరు రూరల్, మార్చి 15: మండలంలోని వివిధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం పరీక్షా సామగ్రి వైసీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర సభ్యులు టి.లిల్లిసురేష్ పంపిణీ చేశారు. పరీక్షలను ధైర్యంగా రాసి శతశాతం ఉత్తీర్ణత సాధించి విద్యనభ్యసించే పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, వైసీపీ నేత తడబారికి సురేష్‌కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో వైసీపీకి షాక్

... 5వ పేజీ తరువాయి

మత్స్యలింగం పట్టించుకోపోతే సాధారణ కార్యకర్తల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. టికెట్ ఖరారైతే ఆయన (మత్స్యలింగం) వ్యవహారశైలి ఇంకెలా వుంటుందోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కనీస సమాచారం ఇవ్వడంలేదని, దీంతో మనస్తాం చెంది వైసీపీ సభ్యత్వానికి, పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు మల్లికార్జునరావు ప్రకటించారు. భవిష్యతు కార్యచరణను త్వరలో ప్రకటిస్తానని ఆయన పేర్కొన్నారు.

ప్రాణం తీసిన గతుకుల రోడ్డు

... 5వ పేజీ తరువాయి

ఛిద్రమైంది. గోతులను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఇదే సమయంలో ఎలమంచిలి ప్రాంతంలోని ఒక కంపెనీ నుంచి సిమెంట్ లోడుతో అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టుకు వెళుతున్న లారీ ఢీకొన్నది. దీంతో వాహనం నడుపుతున్న ఈశ్వరరావు ఎడమవైపునకు పడిపోగా, వెనకు కూర్చున్న సత్యవతి కుడివైపును పడిపోయింది. క్షణాల్లో లారీ ఆమె మీద నుంచి వెళ్లడంతో శరీరం మొత్తం నుజ్జునుజ్జయి సంఘటన స్థలంలోనే మృతిచెందింది. ఈశ్వరరావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మృతురాలి కుమారుడు శివశంకర్ (గ్రామ వలంటీరు) ఇక్కడకు వచ్చి కన్నీరుమున్నీరు అయ్యాడు. ఎస్ఐ దామోదరనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ డోకల సింహాచలంనాయుడుని అదుపులో తీసుకున్నారు. శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఎం.కోటపాడు గ్రామం వుందని, ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారని, ఇంతలోనే సిమెంట్ లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఆమెను కబళించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బాగుండి వుండే ఈ ప్రమాదం జరిగేది కాదని అభిప్రాయపడ్డారు.

చిరు వ్యాపారాలు ఛిన్నాభిన్నం!

» ఉపాధి కోల్పోయి గగ్గోలు పెడుతున్న వ్యాపారులు

నర్సీపట్నం, మార్చి 15 : మూడు దశాబ్దాలుగా నర్సీపట్నం పాల్‌ఘాట్ సెంటర్‌లోని సిటీ క్లబ్ ప్రహరీ గోడను ఆనుకొని తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగిస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్న 30 మంది చిరువ్యాపారుల పరిస్థితి అయోమయంగా మారింది. చెప్పులు, ఫ్యాన్సీ వస్తువులు, దుస్తులు, పండ్లు తదితరాలను తోపుడు బండ్లు మీద పెట్టుకొని ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకుంటూ జీవించేవారు. మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా మునిసిపల్ అధికారులు సిటీ క్లబ్ ప్రహరీ గోడను తొలగించారు. సిటీ క్లబ్ ఆవరణలో అనుమతులు లేకుండా కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. చిరు వ్యాపారులకు సంబంధించిన తోపుడు బండ్లు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అడ్డు లేక పోవడంతో వారి జోలికి వెళ్లలేదు. అయితే బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ చేతుల మీదుగా అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం చేసిన సంగతి తెలిసిందే. షాపుల ప్రారంభోత్సవం పేరుతో తోపుడు బండ్లను ముందు రోజు సాయంత్రం తీయించేశారు. తోపుడు బండ్లను ఖాళీ చేసి ఆర్డీవో కార్యాలయం గోడను ఆనుకొని పెట్టారు. ఆర్డీవో జయరాం తోపుడు బండ్లను వెంటనే తీయించాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు హుటాహుటిన వచ్చి ఆర్డీవో కార్యాలయం గోడ వద్ద ఉన్న సదరు బండ్లను ఉన్నఫళంగా తీయించేశారు. ముప్పై సంవత్సరాలుగా జీవనోపాధి పొందుతున్న వారికి కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డున పడేశారని పలువురు చిరు వ్యాపారులతో పాటు పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా వ్యాపారాలు బంద్ చేసుకుని, తోపుడు బండ్లు ఎక్కడ పెట్టుకోవాలో తెలియ ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఉదయం తోపుడు బండ్లు అన్నింటినీ పాల్‌ఘాట్ సెంటర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద పెట్టుకున్నారు. ప్రభుత్వ స్థలంలో సిటీ క్లబ్ నిర్వాహకులు అక్రమ నిర్మాణం చేస్తున్నారని సామాజిక కార్యకర్తలు రెండు నెలలుగా గగ్గోలు పెట్టినా పట్టించుకోని అధికార యంత్రాంగం, చిరు వ్యాపారుల విషయంలో ఎందుకు అంత కాఠిన్యం చూపించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తోపుడు బండ్లు పెడితే ఆక్రమణలు అయినప్పుడు, ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేసిన దుకాణ సముదాయం ఆక్రమణ కాదా.. అని ప్రశ్నిస్తున్నారు.

సంక్షిప్తంగా..

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

పాడేరు రూరల్, మార్చి 15: వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలను వివరించారు. విద్యార్థుల సమక్షంలో వినియోగదారులకు నాణ్యమైన, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు అంశంపై వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బుడిదే చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు గడ్డంగి రమేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భయంతోనే మానసిక ఒత్తిడి

కొయ్యూరు, మార్చి 15: భయంతోనే మానసిక ఒత్తిడికి గురవుతారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి జేపీ గిరిబాబు చెప్పారు. డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు తదితర పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఒత్తిడి నుంచి బయటకువచ్చి మనో నిబ్బరంతో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రభుదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి యోగా శిబిరాలు

కొయ్యూరు: మండలంలోని సింగవరం, పిడుగురాయి గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి యోగా, ధ్యాన శిబిరాలు నిర్వహించనున్నట్టు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి గిరిబాబు తెలిపారు. ఆసక్తి గల వారు 7013443627 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

చింతపల్లి, మార్చి 15: ఆదివాసీ విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వర్తక సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు చేయూత వారియర్స్ ట్రస్టు సభ్యులు, వర్తక సంఘం నాయకులు శుక్రవారం పరీక్షల రాత సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య, ఉద్యోగాలకు పదో తరగతి మార్కులు చాలా కీలకమని, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం జేపీ కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం, చేయూత వారియర్స్ ట్రస్టు సభ్యులు దూనబోయిన రమణ, అరుణ్, ఉమర్, జగన్ పాల్గొన్నారు.

సికెల్‌సెల్ ఎనీమియాపై అప్రమత్తత అవసరం

చింతపల్లి, మార్చి 15: సికెల్‌సెల్ ఎనీమియాపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వీర సాయిబాబు సూచించారు. కిన్నెర్లలోని అర్ధరవీధిలో శుక్రవారం తాజంగి పీహెచ్‌సీ వైద్యాధికారి కుమార్‌బాబు ఆధ్వర్యంలో ప్రచార రథంతో విద్యార్థులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికెల్‌సెల్ ఎనీమియా వారసత్వంగా సంక్రమిస్తుందన్నారు. పిల్లలకు ఒకేసారి రక్తం(హెచ్‌బీ) పడిపోతే సికెల్‌సెల్ ఎనీమియా పరీక్ష చేయించాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వేసుకోవాలన్నారు. డాక్టర్ కుమార్‌బాబు మాట్లాడుతూ కళ్లు పసుపు రంగులోకి మారడం, ఒళ్లు, కీళ్ల టటవనొప్పులు, శ్వాస తీసుకోవడం ఇబ్బంది, అలసట, రక్తహీనత కలిగి ఉంటే సికెల్ సెల్ ఎనీమియా వ్యాధి పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి రాజేశ్, వైసీపీ నాయకుడు బెన్నిబాబు పాల్గొన్నారు.

నాటు తుపాకులు సరెండర్ చేయాలి

జి.మాడుగుల, మార్చి 15: మండలంలోని గిరిజనుల దగ్గర నున్న నాటు తుపాకులు స్వచ్ఛందంగా అందజేయాలని ఎస్ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. అనుమతులు లేని తుపాకులు కలిగిన ఉంటే వారం రోజుల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో అందజేయాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్న వారి సమాచారం అందిస్తే బహుమతులు అందిస్తామని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. 9440904222, 9440904221 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొండదొర వర్గానికి టిక్కెట్ ఇవ్వాలి

జి.మాడుగుల, మార్చి 15: పాడేరు నియోజకవర్గంలో టీడీపీ కూటమి నుంచి కొండదొర సామాజిక వర్గానికి ఎమ్మెల్యే టిక్కెట్‌ను కేటాయించాలని సంఘం నాయకులు సెగ్గె కొండలరావు, గల్లెలి నానబాబు, పోతురాజు కోరారు. శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌లో వైసీపీ నుంచి జి.మాధవిని టిక్కెట్ కేటాయించగా కొండదొర సామాజిక వర్గం బలంగా ఉండడంతో రాష్ట్రంలో ఎక్కడి లేని మెజారిటీని వచ్చిందని గుర్తుచేశారు. ఉమ్మడి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో పాడేరు అసెంబ్లీ సీటు కొండదొర సామాజిక వర్గానికి కేటాయిస్తే భారీ మెజారిటీ సాధిస్తామని వారు చెప్పారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

కొయ్యూరు, మార్చి 15: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమని తహసీల్దార్‌రాజేశ్వరావు చెప్పారు. రాజేంద్రపాలెం సచివాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం వినియోగంపై శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అనంతరం పలు పోలింగ్ కేంద్రాలలో వసతులను పరిశీలించారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలం, వీఆర్‌వో పండయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: సమర్థవంతమైన నేతను ఎన్నుకోవడానికి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ టి.రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్దెనిమిదేళ్లు నిండిన వారంతా ఓటు హక్కుతో పాటు ఎన్నికలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వలసగెడ్డలో సివిక్ యాక్షన్ కార్యక్రమం

సీలేరు, మార్చి 15: దుప్పులవాడ పంచాయతీలోని వలసగెడ్డ గ్రామంలో సీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ పోలీసులు శుక్రవారం సివిక్ యాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ సింతిల్‌కుమార్ గిరిజనుల సమస్యలపై ఆరా తీశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సీఆర్‌పీఎఫ్‌లో చేరి దేశ రక్షణకు దోహదపడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అనంతరం గిరిజనులకు వైద్య పరీక్షలను చేసి మందులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ జె.రామకృష్ణ, సీఆర్‌పీఎఫ్ వైద్యాధికారి నితిన్, సీలేరు వైద్యాధికారి సౌమ్య పాల్గొన్నారు.